ప్రొఫెసర్ కోమల లక్ష్మికి డాక్టరేట్

రాజమహేంద్రవరం : స్థానిక ఆర్ట్స్ కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి చిన్నం కోమల లక్ష్మి గీతం యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారని ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతం యూనివర్సిటీకి చెందిన భౌతిక శాస్త్ర ఆచార్యులు డాక్టర్ టి.దుర్గారావు పర్యవేక్షణలో కోమల లక్ష్మి 'ధన అయాన్లు ప్రతిక్షేపించిన బిస్మత్ ఫెర్రైట్‌ల అయస్కాంత మరియు అనయస్కాంత ధర్మాల పరిశోధనలు' అనే అంశంపై పరిశోధన చేశారన్నారు. ఈ పరిశోధనా గ్రంథానికి గీతం యూనివర్శిటీ ఆమోద ముద్రం వేసిందన్నారు. ఈ నెల 1న గీతం యూనివర్సిటీ నుంచి ఆమె డాక్టరేట్ తీసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామమూర్తి, సహాయ ప్రిన్సిపల్ జి.చంద్రశేఖర్, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆకెళ్ళ రాజేశ్వరి, భౌతికశాస్త్ర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

పాడి కట్టేస్తున్నారు

- తగ్గిపోతున్న ఆదాయం.. పెరుగుతున్న చాకిరి..
- అంటు రోగాలతో అవస్థలు
- కబేళాలకు తరలుతున్న పాడి సంపద

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంతో పాటు పశుపోషణ గతంలో ప్రధాన ఆదాయ వనరుగా ఉండేది. దశాబ్దకాలంగా ఆ పరిస్థితులు తలకిందులవుతున్నాయని రైతులు చెబుతున్నారు. పశుగ్రాసం నుంచి దాణా వరకు అన్ని ధరలూ పెరిగిపోవడంతో పాడిరైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అప్పు చేసి ఇవన్నీ పెట్టినా పాలకు గిట్టుబాటు ధర రావడం లేదు. ఫలితంగా పాడి సంపదను కబేళాలకు తరలిస్తున్నారు. జిల్లాలో అధికారుల గణాంకాల ప్రకారం జిల్లాలో ఆవులు 58,000, గేదెలు 1.20 లక్షలు ఉన్నాయి. రోజుకు సరాసరి 2,13,400 లీటర్ల పాల ఉత్పత్తి ఉన్నట్టు సమాచారం. గత కొన్నేళ్లుగా ఈ సంఖ్య గణనీయంగా తగ్గింది. మరో వైపు పాల కేంద్రాల్లో ఫాట్ తక్కువుగా ఉందన్న కారణంతో లీటరుకు రూ.28 నుంచి రూ.35 మధ్య ఇస్తున్నారు. పెరిగిన ధరలు, పోషణ ఖర్చుల ఆధారంగ లెక్కిస్తే కనీసర లీటరు రూ.60 వరకూ చెల్లించాలని, బ్యాంకులు ప్రత్యేక రుణాలు ఇవ్వాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

వ్యవసాయ యాంత్రీకరణతో దాణా కొరత

వ్యవసాయంలో యాంత్రీకరణ రెండు సీజన్‌లలోనూ వరికోత యంత్రాలతోనే రైతులు పంటలను కోస్తున్నారు. దీంతో ఎండుగడ్డి కొరత ఏర్పడుతోంది. పచ్చిక బయళ్లు సైతం కరువయ్యాయి. దీంతో కేవలం పశుదాణా మీదే రైతులు ఆధార పడుతున్నారు. ట్రాక్టరు ఎండుగడ్డికి రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. పశుదాణా, ఖర్చు, పాలకు గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రభుత్వ ప్రోత్సాహం అంతంత మాత్రంగానే ఉండడంతో పాడి పెంపకంపై రైతులకు ఆసక్తి సన్నగిల్లుతోంది. రూ.4 లక్షలు పెట్టుబడి పెడితే నాలుగు పాడి ఆవులు వస్తున్నాయి. వీటిని మేపడానికి, చాకిరీకి ఇద్దరు మనుషులు రోజంతా పని చేయాలి. ఈ ఆవుల ద్వారా రోజుకి రూ.800 ఆదాయం వస్తుంది. ఇందులో దాణా రూ.400, ఇద్దరు మనుషులకు కూలీ రూ.400 పోతుంది. పెట్టుబడి, వాటికి చేస్తున్న చాకిరీతో పోలిస్తే వచ్చే ఆదాయం చాలా తక్కువుగా ఉంటోంది. కూలి పనులకు వెళితే రూ.300 వరకూ వస్తాయనే అభిప్రాయం వ్యకమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రతిచోటా పాడి అభివద్ధి 5 శాతానికి పైగా పడిపోయింది.

కబేళాలకు తరలింపు

పాల ధరలు లేకపోవటం, దాణా ధరలు పెరగడంతో పాటు అంటు వ్యాధులు భయం పశపోషకులను వెంటాడుతోంది. ఇతర రాష్ట్రాల్లో పశువులకు లంపీ అనే చర్మ వ్యాధి సోకుతోంది. మందలో ఒక పశువుకు ఈ వ్యాధి సోకితే ఇతర పశువులకు వ్యాప్తి చెందే ప్రమాదం పొంచి ఉంది. సీజనల్‌గా వచ్చే వ్యాధులతోనే ఏటా పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు పశువులు మృత్యువాత పడటం, ఆనారోగ్య కారణాల రీత్యా పాల దిగుబడులు తగ్గిపోవటంతో పోషణ భారంగా మారుతోంది. ఈ పరిస్థితులలో పాడిపశువులను నమ్ముకునే కన్నా.. కూలి పనికి వెళితే మంచిదని కొంతమంది రైతులు అభిప్రాయపడుతున్నారు. పశువుల ఆస్పత్రులలో వైద్య సిబ్బంది, కొరత మందుల కొరతతో రూ.వేలలో ఖర్చు చేయాల్సి వస్తోంది. లంపీ వ్యాధి నియంత్రణలో భాగంగా ప్రభుత్వ యంత్రాంగం పశువుల ఎగుమతులు, దిగుమతులపై ఆంక్షలు విధించినప్పటికీ పోషకులను భయం వెంటాడుతోంది. దీంతో పశువులను కబేళాలకు తరలించేస్తున్నారు. ప్రభుత్వం వ్యాధులను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, రాయితీ ధరలో దాణా అందజేసి తమను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని పాడి రైతులు కోరుతున్నారు.

ఆందోళన కలిగిస్తున్న వ్యాధులు

పశుపోషణతో వచ్చే పాల దిగుబడిని రాజమహేంద్రవరంలో విక్రయించుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. 10 పశువులను పోషిస్తున్నాను. పశువైద్యశాలలో సిబ్బంది కొరత, మందుల కొరతల కారణంగా సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నాము. దాణా, ఎండుగట్టి వాటితో పాటు పశువైద్యానికి మందులు కొనుగోలు అదనపు భారమవుతోంది. లంపీ వంటి ప్రమాదకరమైన వ్యాధులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ చాకిరీకి బదులుగా ఎక్కడైనా పనికి వెళ్లినా కనీస కూలి గిట్టుబాటు అవుతుందనే ఆలోచిస్తున్నాను. దీంతో పశువులను విక్రయించేయాలని నిర్ణయించు కున్నాను.

- ఆర్.ప్రసాద్, పాడి రైతు, తొర్రేడు

దాణా కొరత వేధిస్తోంది

ఎనిమిది పశువులను మేపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఏటా పశువుల దాణా కొరత ఎదురవుతోంది. ఈ ఏడాది వరదల నేపథ్యంలో తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా పంపిణీ చేసి ఆదుకున్నా... కొనుగోలు చేయక తప్పడం లేదు. ట్రాక్టరు ఎండుగడ్డి డిమాండ్ ఆధారంగా 8000 పైమాటే. దీంతో పెట్టుబడి అధికమై పశుపోషణ భారమవుతోంది.

కె. నాగేశ్వరరావు ,పాడి రైతు, సీతంపేట

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలు అమలు చేయాలని, ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్లతో నిర్వహిస్తున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముద్రించిన పోస్టర్‌ను శ్యామల సెంటర్‌లో ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అడ్డగోలుగా విడగొట్టిన పాపంలో కాంగ్రెస్, బిజెపిదే ప్రధాన పాత్ర అన్నారు. విభజన జరిగి 11ఏళ్లయినా నేటికీ రాష్ట్రానికి రావాల్సిన ఏ ఒక్క హామీని సంపూర్ణంగా అమలు చేయలేదన్నారు. పార్లమెంటులో ప్రధానమంత్రి మోడీ ఇచ్చిన హామీలకే దిక్కుమొక్కు లేని పరిస్థితి దాపురించిందన్నారు. ఐదేళ్లు కాదు పదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన బిజెపి పెద్దలు నేడు మాట మార్చారన్నారు. తిరుపతి వెంకన్న సాక్షిగా చెప్పిన హామీని అధికారంలోకి రాగానే మర్చిపోయారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చట్టబద్ధంగా ఇవ్వాల్సిన వాటిని కూడా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఇవ్వకుండా తెలుగు ప్రజలపై కక్ష సాధిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014లో చేసిన అనేక అంశాలను అమలు చేయకుండా దొంగ నాటకాలు ఆడుతున్నారన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించి ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలన్నారు. కడపలో సెయిల్ అధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను స్థాపించాలని, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర కు కెబికె తరహా ప్యాకేజీ ఇవ్వాలని, రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్మాణం చేపట్టాలని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ జులై 18న ధర్నాను నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రపై పోరాడేందుకు ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ నాయకులు టి.రాజేష్, రామకృష్ణ, నిశ్చల్, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్‌తో పేదలకు భరోసా

ప్రజాశక్తి - నిడదవోలు

సిఎంఆర్ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం నిడదవోలు పార్టీ కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందించారు. 30 మందికి రూ.22,94,913 విలువైన చెక్కులు, మరో ముగ్గురికి రూ.8 లక్షల విలువైన ఎల్ఓసీ పత్రాలను స్వయంగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుత ఇప్పటివరకు నిడదవోలు నియోజకవర్గంలో 192 మందికి రూ.1.84 కోట్ల లబ్ధి చేకూర్చామన్నారు. నిరుపేదలు ఎవరైనా ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటే వారికి ఆర్థికంగా ఇబ్బంది కలుగకుండా సిఎంఆర్ఎఫ్ నుంచి సాయం అందిస్తున్నామన్నారు. పేదల సంక్షేమం విషయంలో సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందన్నారు.

జీతాలు లేక సత్యసాయి కార్మికుల ఇబ్బందులు

ప్రజాశక్తి-గోకవరం

వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని సత్యసాయి డ్రింకింగ్ వాటర్ కార్మికులు వేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిలో భాగంగానే సత్య సాయి డ్రింకింగ్ వాటర్ కార్మికుల నిరసన దీక్ష చేపట్టారు. వీరి దీక్షలతో ప్రజలు తాగునీటికి నానా ఇబ్బందులు పడుతున్నారు. కార్మికుల దీక్షలను ప్రభుత్వం పట్టించుకుని వారికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. కార్మికుల దీక్షతో గోకవరంలో తాగునీటి ట్యాంకులు ఖాళీగా దర్శనమిస్తున్నాయని తెలిపారు. తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. వెంటనే అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని, తమకు తాగునీటిని అందించాలని వారు కోరుతున్నారు.

700 టన్నుల ఇసుక సీజ్

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని మల్లేశ్వరంలోని ప్రయివేటు లేఔట్‌లో అక్రమంగా భద్రపరిచిన 700 టన్నుల ఇసుకను సీజ్ చేసినట్టు జిల్లా మైనింగ్ అధికారి శైలజ తెలిపారు. గ్రామానికి చెందిన నాయకుడు మేడిచర్ల భాస్కర శివకుమార్‌కు చెందినదిగా నిర్ధారించారు. మండల పరిధిలో కానూరు, నడిపల్లి, తీపర్రు, కాకరపర్రు, ఖండవల్లి నిడదవోలు - నరసాపురం రోడ్డు పక్కన ఇంటి నిర్మాణాల పేర ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను డంప్ చేశారని స్థానికులు చెబుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో దీన్ని అధిక ధరకు అమ్ముకునే యోచనలో ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. వీటిపైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్వాంటం టెక్నాలజీపై పట్టు అవసరం

ప్రజాశక్తి - రాజానగరం

మాట్లాడుతున్న విసి ప్రసన్నశ్రీ

క్వాంటం టెక్నాలజీపై పట్టు అవసరమని నన్నయ యూనివర్శిటీ విసి ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో క్వాంటం టెక్నాలజీలపై ఎఐసిటిఇ, ఎటిఎఎల్ స్పాన్సర్డ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించారు. యూనివర్సిటీ సెమినార్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి విసి ప్రసన్నశ్రీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటి) వంటి ప్రముఖ సంస్థల నుంచి ప్రముఖ రిసోర్స్ పర్సన్‌లు ఒకచోట చేర్చి, వేగంగా అభివృద్ధి చెందుతున్న క్వాంటం టెక్నాలజీల రంగాన్ని అన్వేషించడమే లక్ష్యంగా ఎఫ్‌డిపి కార్యక్రమం సాగాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి అధ్యాపక సభ్యులు ఉత్సాహంగా పాల్గొనడం హర్షనీయమన్నారు. సమకాలీన విద్యా, పారిశ్రామిక రంగంలో క్వాంటం టెక్నాలజీ ప్రాధాన్యతను తెలియజేశారు. ఉన్నత విద్యా పాఠ్యాంశాల్లో క్వాంటం కంప్యూటింగ్‌ను ఏకీకృతం చేయడాన్ని ప్రోత్సహిస్తున్న ఎపిఎస్‌సిహెచ్ఇ, ఎఐసిటిఇ లక్ష్యాలతో ఎఫ్‌డిపి నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రారంభించిన క్వాంటం వ్యాలీ చొరవను భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానాలకు కేంద్రంగా రాష్ట్రాన్ని మార్చే దిశగా ఒక దార్శనిక అడుగుగా ఆమె ప్రస్తావించారు. ఈ కార్యక్రమం చక్కని అకడమిక్ ప్రోగ్రామ్ అని, అధ్యాపక సభ్యులకు క్వాంటం అల్గోరిథంలు, క్వాంటం కంప్యూటింగ్ ప్లాట్‌ఫారమ్‌లు వాటి వాస్తవ ప్రపంచ అనువర్తనాలపై ప్రాథమిక, అధునాతన దృక్పథాన్ని అందిస్తుందన్నారు. ఎఫ్‌డిపి కన్వీనర్ డాక్టర్ వి.పెర్సిస్ ఈ వివరాలు తెలియజేశారు. క్వాంటం టెక్నాలజీలపై ఎఐసిటిఇ, ఎటిఎఎల్ ఆర్థిక సహకారంతో జులై 14 నుంచి 19 వరకు వారం రోజుల పాటు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా పలు విద్యాసంస్థల నుండి ప్రాతినిథ్యం వహిస్తున్న 50 మంది ఫ్యాకల్టీ సభ్యులు హాజరయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఎఫ్‌డిపి కన్వీనర్ డాక్టర్ వి.పెర్సిస్, కో-కన్వీనర్ డాక్టర్ జి.కీర్తి, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ బి.కెజియారాణి పాల్గొన్నారు.

విద్యార్థిని సత్కరిస్తున్న మంత్రి లోకేష్

తిరుమల విద్యార్థులకు మంత్రి లోకేష్ అభినందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నీట్ - 2025లో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 19వ ర్యాంకు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన రాజమహేంద్రవరం తిరుమల విద్యార్థి డి.కార్తీక్‌రామ్‌కిరీటిని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. జెఇఇ అడ్వాన్స్- 2025లో ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో ఆలిండియా 8వ ర్యాంకు సాధించిన కె.యశ్వంత్ సాత్విక్, ఎస్‌సి కేటగిరిలో ఆలిండియా 2వ ర్యాంకు సాధించిన కె.ప్రణీతలను మంత్రి లోకేష్ పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ ఘనతను సాధించిన తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావును మంత్రి లోకేష్ అభినందించారు. స్థానిక ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో కలిసి ఆయా విద్యార్థులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ చిన్న విషయలకే నేటి తరం విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. లైఫ్ అంటేనే ఛాలెంజ్ అని, దీనిని స్వీకరించాలని, అధైర్యపడకూడదని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర భవిష్యత్ మీరేనని, ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని, కలల సాధనకు నిరంతరం శ్రమించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు పాల్గొన్నారు

డిగ్రీలో డ్యూయల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

డిగ్రీలో డ్యూయల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలని, అడ్మిషన్లు ఆఫ్‌లైన్‌లో ప్రారంభించాలని, శ్రీ కందుకూరి రాజ్యలక్ష్మి ఇంటర్ కళాశాలకు ప్రిన్సిపల్‌ని కేటాయించాలని, అధ్యపకులను కేటాయించాలని, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టర్ పి.ప్రశాంతికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా మాట్లాడారు. రోజుకో మాట పూటకో విధానంలా ఉన్నత విద్యామండలి తీరు ఉందన్నారు. డ్యూయల్ డిగ్రీ విధానం అమలు చేస్తామని ఉత్తర్వులు ఇచ్చి ఇప్పుడు సింగిల్ మేజర్ విధానం కొనసాగిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వ విధానాలను నిలదీసిన విద్యాశాఖ మంత్రి లోకేష్ నేడు అదే బాటలో అడుగులు వేస్తున్నారన్నారు. గత నిర్ణయానికి అనుగుణంగా డిగ్రీలో డ్యూయల్ మేజర్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించి, మైనర్ సబ్జెక్టుకు క్రెడిట్ పాయింట్స్ పెంచాలని కోరారు. 2022లో కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాల జిఒ 42 ప్రకారం ప్రభుత్వ పరమైందన్నారు. ఇందులో జూనియర్ కళాశాలకు ప్రిన్సిపల్‌ని కేటాయించాలని, పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని, అధ్యాపకులను కేటాయించాలని అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. ఇంటర్ ఫలితాలు వెలవడి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే ఆఫ్‌లైన్‌లో అయినా ఈ అడ్మిషన్లు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జ్యోతి, చైతన్య, కార్తీక్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కొత్త నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి- కడియం

కొత్తగా నర్సరీలను ఏర్పాటు చేయాలనుకునే రైతులు తప్పనిసరిగా లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని, ఇప్పటికే లైసెన్స్ ఉన్నవారు రెన్యువల్ చేయించుకోవాలని మండల ఉద్యాన అధికారి పి.లావణ్య తెలిపారు. జగ్గంపేట నుంచి బదిలీపై వచ్చిన లావణ్య కడియం మండలం నూతన ఉద్యానఅధికారిణిగా భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా నర్సరీలు ఏర్పాటు చేయాలనుకునే రైతులు, రైతు భరోసా సిబ్బంది ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటుగా ఒక పాస్ పోర్ట్ సైజు ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్, 1బి జిరాక్స్, ఎఫ్ఎంబి, ఎల్‌పిఎం మ్యాప్, సర్వే బ్లూ ప్రింట్, సాయిల్, వాటర్ అనాలసిస్ రిపోర్టు తదితర డాక్యుమెంట్లతో సంబంధిత అధికారికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ చేసి 90 రోజుల వ్యవధిలో లైసెన్స్ ఇస్తామన్నారు. దీని కాల పరిమితి మూడేళ్లు ఉంటుందన్నారు. ఇప్పటికే లైసెన్స్ ఉండీ, కాలపరిమితి ముగిసిన రైతులు పాత లైసెన్స్, పైన తెలుపబడిన డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీరికి 30 రోజుల్లో రెన్యువల్ లైసెన్స్ మంజూరు చేస్తామన్నారు.

పిజిఆర్ఎస్‌కు 238 అర్జీలు : కలెక్టర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరేట్‌లో కలెక్ట పి.ప్రశాంతి జెసి ఇతర అధికారులతో కలిసి సోమవారం పిజిఆర్ఎస్‌లో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి 238 అర్జీలను స్వీకరించామని తెలిపారు. అర్జీలకు సత్వర పరిష్కారం చూపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే సమయంలో ప్రజలకు ప్రభుత్వం అందచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడంతో జవాబుదారీగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించి ఆయా ప్రభుత్వ శాఖల పనితీరుపై ప్రతికూల స్పందన వచ్చే వాటిపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, ప్రజలతో నేరుగా మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జెసి ఎస్.చిన్నరాముడు, డిఆర్ఒ టి.సీతారామమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ప్రేమ్‌కుమార్, భాగ్యలక్ష్మి, సిపిఒ ఎల్.అప్పలకొండ, డివిజనల్ అభివద్ధి అధికారులు పి.వీణాదేవి, ఎ.స్లీవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి- కొవ్వూరు

ప్రభుత్వం ఇచ్చిన రాతపూర్వక హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్టు మున్సిపల్ కమిషనర్‌కు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకుల సోమవారం నోటీసు అందించారు. వారు మాట్లాడుతూ ఆప్కాస్ స్థానంలో ప్రైవేటు ఏజెన్సీలకు అధికారం ఇవ్వాలనే ప్రతిపాదనలు ఉపసంహరించాలన్నారు. మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు.రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షల నుంచి రూ. 7 లక్షలకు పెంచాలన్నారు. దహన సంస్కారాలకు రూ.15వేల నుండి రూ.20వేలకు పెంచాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు ఎం.సుందర్‌బాబు, అధ్యక్షులు భూపతి రవీంద్ర, ప్రధాన కార్యదర్శి పి.వాసు, కళ్యాణ్, రాజేష్, రాజన్న, అప్పారావు, ఎం.కిషోర్, మీసాల జ్యోతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్మికులకు సమ్మె నోటీసు అందిస్తున్న నాయకులు, కార్మికులు

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

ప్రజాశక్తి - బిక్కవోలు

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని ఎస్ఐ రవిచంద్రకుమార్ అన్నారు. పందలపాక శ్రీ పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బిక్కవోలు రక్షణ శాఖ ఆధ్వర్యంలో నైతిక విలువలపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఐ రవిచంద్ర హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. జూదాలు వంటి కార్యకలాపాల జోలికి పోరాదన్నారు. మొబైల్‌ను అవసరం మేరకే వాడాలన్నారు. ఎస్ఓఎస్ యాప్ గురించి విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని తమ పాఠశాలలో నిర్వహించినందుకు బిక్కవోలు పోలీస్ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కె.సత్తిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫోటో రైట్ అప్

హెచ్ఎంలకు శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - రాజానగరం

మండలంలో మల్లంపూడి సాయి మాధవి ఇంజినీరింగ్ కళాశాలలో స్కూల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా హెచ్ఎంలకు నాలుగు రోజుల పాటు జరిగే శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 176 మంది హెచ్ఎంలు, 9 మంది మాస్టర్ ఫెసిలిడేటర్లు హాజరయ్యారు. జిల్లా సర్వ శిక్ష అభియాన్ అడిషినల్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సుభాషిణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుకోవాలన్నారు. బోధనా సామర్థ్యం పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాల ఆర్థిక లావాదేవీలపై రికార్డులు నిర్వహించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యా కమిటీ, ఉపాధ్యాయులతో టీమ్‌గా స్కూలు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. దీనికి ప్రధాన ఉపాధ్యాయుడు నాయకత్వం వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వ శిక్ష ఎఎంఒ డి.గౌరీశంకర్రావు, అనపర్తి ఎంఇఒ సత్తిరెడ్డి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కోడి పందేల శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి - గోపాలపురం

దొండపూడి, వెంకటాయపాలెం గ్రామాల్లో కోడిపందేల శిబిరాలపై దాడులు చేసి 20 మందిని అరెస్టు చేశామని ఎస్ఐ పి.మనోహర్ తెలిపారు. సిఐ బివిఎన్.నాయక్ పర్యవేక్షణలో వెంకటాయపాలెం గ్రామ శివారు పామాయిల్ తోటలో దాడుల చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.3,800 నగదు, 2 కోడి పుంజులు, 2 కత్తులు సీజ్ చేశామన్నారు. దొండపూడి గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్న 12 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.8,020 నగదును, 2 కోడి పుంజులు, 2 కత్తులు సీజ్ చేశామని తెలిపారు. రెండు చోట్ల మొత్తం 20 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

పేకాడుతున్న పలువురి అరెస్ట్

ప్రజాశక్తి-గోకవరం, జగ్గంపేట

పేకాట ఆడుతున్న 10 మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో కృష్ణుని పాలెం పంచాయతీ వెంకటాపురం గ్రామం శివారు చిలక్కొండ వద్ద పేకాట శిబిరంపై దాడి చేశామన్నారు. పది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.7వేల నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

జగ్గంపేట మండలంలోని జె.కొత్తూరు శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్ఐ రఘునాథ్ రావు, సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేసినట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.11,300 స్వాధీనం చేసుకున్నారు.

ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి- కొవ్వూరు

చాగల్లు రైల్వే స్టేషన్ నుంచి నిడదవోలు ఆర్ఎస్ మధ్య సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. రైలు నుంచి జారి పడినట్లు మృతి చెందినట్లు భావిస్తున్నామన్నారు. మృతుడు కుడి చేతిపై నెమలి పించం పచ్చబొట్టు ఉందన్నారు. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని నిడదవోలు ఆర్‌పి హెచ్‌సి డి.శ్రీనివాసరావు తెలిపారు వివరాలకు 9490617090, 9948010061 నెంబర్లను సంప్రదించాలన్నారు.

తునిలో పట్టపగలు భారీ చోరీ

ప్రజాశక్తి-తుని

తుని పట్టణంలో సోమవారం పట్టపగలు భారీ చోరీ చోటు చేసుకుంది. కోమాకుల వారి వీధిలో నక్కా లోకేష్ ఇంట్లో ఇంటి తాళాలు పగలగొట్టి రూ. పది లక్షల విలువైన బంగారం, రూ.4 వేల నగదు దొంగలు ఎత్తుకెళ్ళారని బాధితులు తుని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీమ్ సహకారంతో ఆధారాలు సేకరిస్తున్నారు. పూర్తిస్థాయిలో కేసు దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సిఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి- తాళ్లరేవు

కోరంగి పంచాయతీ బొడ్డు చిన వెంకటాయపాలెం గ్రామానికి చెందిన సంగాడి సూరిబాబు (40) వేటకు వెళ్లి మృతి చెందినట్లు కోరంగి ఎస్ఐ. సత్యనారాయణ తెలిపారు. మృతుడు సూరిబాబుతో కలిసి మరో అయిదుగురు ఫైబర్ బోటులో 13వ తేదీ రాత్రి సముద్రంలోకి వేటకు వెళ్లారు. ప్రమాదవశాత్తు సూరిబాబు బోటు నుండి పడి పోయి మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిజిహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ.సత్యనారాయణ తెలిపారు.

లారీ డ్రైవర్ మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-తాళ్లరేవు

కోటనందూరు మండలం బిళ్లనందూరుకు చెందిన ట్యాంకర్ లారీ డ్రైవర్ పెదరెడ్ల రామారావు (40) మృతదేహం సోమవారం సుంకరపాలెంలో లభ్యమయ్యింది. కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తన ట్యాంకర్ ఢీ కొనడంతో ఈ నెల 8వ తేదీ పటవల వద్ద ఒక మహిళ మతి చెందిన నేపథ్యంలో ఆమె మరణానికి తానే కారణమని అదే రోజు విషం తాగి డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. సుంకరపాలెం ప్రాంతంలో ఒక వ్యాపార సంస్థ వద్ద సోమవారం రామారావు మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

కెనరా బ్యాంక్ వద్ద ఖాతాదారుల ఆందోళన

ప్రజాశక్తి-తుని

తుని రూరల్ తేటగుంటలో కెనరా బ్యాంక్ వద్ద తాకట్టు పెట్టిన బంగారం తమకు ఇవ్వాలని స్థానిక ఖాతాదారులు సోమవారం ఆందోళన చేపట్టారు. బ్యాంకు ఎదుట బైఠాయించారు. దీంతో బ్యాంకు సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రూరల్ సిఐ జి.చెన్నకేశవరావు ఎస్ఐ, కృష్ణమాచార్యులు రంగ ప్రవేశం చేసి పరిస్థితి అదుపులోకి తెచ్చారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ కెనరా బ్యాంక్‌లో సుమారు 200 మందికి పైగా బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టామని, ఐదు నెలల క్రితం బ్యాంకు సిబ్బంది బంగారాన్ని గోల్‌మాల్ చేశారని బాధితులు తెలిపారు. అప్పట్లో బ్యాంకు ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఐదు నెలల్లోగా బంగారు వస్తువులను అప్పగిస్తామని హామీ ఇచ్చారని బాధితులు తెలిపారు. బ్యాంకు ఉన్నతాధికారులు ఇచ్చిన ఐదు నెలల కాలం ముగిసిపోయింది. అయినప్పటికీ తమ బంగారు వస్తువులు తమకు ఇవ్వలేదని వాపోయారు.

పోలీసు పిజిఆర్ఎస్‌కు 36 ఫిర్యాదులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పి(అడ్మిన్) ఎన్‌బిఎం.మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పి(లా అండ్ ఆర్డర్) ఎవి.సుబ్బరాజు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడారు. వెంటనే నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

పేదల సాగులో ఉన్న ప్రభుత్వ సీలింగ్ భూమి ఎల్‌సిసి నెం 59/ఆర్‌జెవై/75కి జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. అనంతరం జెసికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మండవ దుర్గాప్రసాద్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ శ్రీమన్నారాయణ,ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు జనపల్లి సత్తిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట నాయుడు, గంగంపాలెం గ్రామ లబ్ధిదారులు కాంద్రేగుల నాగమణి,పందిరి త్రిమూర్తులు, దేశ గౌరమ్మ, కనుసు నూకరాజుదొర, కనుసు సూరిబాబు దొర, చిన్న అప్పారావు, భద్రం, తదితరులు నాయకత్వం వహించారు. వారు మాట్లాడుతూ గోకవరం మండలం గంగంపాలెంలో ప్రభుత్వ ఎల్‌సిసి భూమి 1993 నుంచి నేటి వరకు 37 కుటుంబాల వారు సాగు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ భూములకు పట్టాలు ఇవ్వాలని 30 ఏళ్లుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేశామన్నారు. హైకోర్టును కూడా ఆశ్రయించారన్నారు. విప్ నెంబర్ 14890/2021తో 2021 జులై 7న ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసి పాస్ పుస్తకాలు ఇచ్చిందన్నారు. అయితే కొంత మంది అక్రమార్కులు అధికారులు కలిసి వీటిని కబ్జా చేసేందుకు కుట్రలు పన్నారన్నారు. ఈ భూములను వారు అధికారంతో జిరాయితీ భూములుగా రికార్డుల్లో మార్చి అక్రమ రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఈ అక్రమాలపై కలెక్టర్ ఆదేశాల మేరకు రాజమండ్రి సబ్ కలెక్టర్ విచారణ జరిపి నివేదిక ఇచ్చారన్నారు. ఈ నివేదిక ఆధారంగా సంబంధిత అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. పేదలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలన్నారు.

ధర్నా చేస్తున్న బాధితులు

సబ్సిడీపై సోలార్ విద్యుత్

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండల విద్యుత్ వినియోగదారులకు పిఎం సూర్యాఘర్ పథకంలో భాగంగా రాయితీ సోలార్ పథకంలో భాగంగా 1 కిలో వాట్స్‌కి రూ.30 వేలు, 2 కిలో వాట్స్‌కి రూ.60 వేలు, 3 కిలో వాట్స్‌కి మరో 18 వేలు కలిపి మొత్తం 3 కిలో వాట్స్‌కి రూ.78 వేల రియితీపై సోలార్ రూఫ్‌ను ఏర్పాటు చేస్తున్నారని విద్యుత్ శాఖ అధికారి ఎస్.త్రిమూర్తులు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాస్‌పోర్ట్ పడిపోయినది

అల్లవరం మండలం, ఓడలరేవు గ్రామానికి చెందిన మల్లాడి భాస్కరరావు, S/o. మల్లాడి సూర్య సత్య కుమార స్వామి కి చెందిన **K8542309** నెంబరు కల పాస్‌పోర్ట్ పడిపోయినది. జిరాక్స్ నిమిత్తము 5 జూలై 2025న ఓడలరేవులోని మా ఇంటి నుండి బెండమూర్లంక వచ్చుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికినవారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

అడ్రస్:
మల్లాడి భాస్కరరావు,
S/o. మల్లాడి సూర్య సత్య కుమార స్వామి,
గ్రామపంచాయతీ రోడ్డు, ఓడలరేవు,
అల్లవరం మండలం- 533210,
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్:9949954239

కడియం డిప్యూటీ ఎంపిడిఒగా శ్రీనివాస్

ప్రజాశక్తి-కడియం

కడియం డిప్యూటీ ఎంపిడిఒగా ఎన్.శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఆయన అమలాపురం డివిజనల్ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి డిప్యూటీ ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి పొందారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ మాట్లాడుతూ కడియం మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమానికి తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో సమన్వయ పరచుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఆచితూచి మాట్లాడాలి : గుల్లంపూడి

ప్రజాశక్తి-గోకవరం

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై కామరాజుపేట మాజీ సర్పంచ్, వేణుగోపాలస్వామి వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్ అడపా వెంకట రామారావు చులకనభావంతో మాట్లాడటం తగదని, ఆచితూచి మాట్లాడాలని జనసేన పార్టీ నాయకులు గుల్లంపూడి ఆనంద్ సూచించారు. కామరాజుపేటలోని సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిత్రధర్మ పాటించకపోతే ఇలాంటి వ్యాఖ్యల వల్ల ప్రజల్లో చులకన భావం పెరుగుతుందన్నారు. ఏదైనా మాట్లాడేటప్పుడు ఆచితూచి మాట్లాడాలని సూచించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు రాజమంద్రపు నరసింహమూర్తి, జి.నాగేశ్వరరావు, ఆర్.సుబ్బారావు, ఆర్.రాజు, జి.రామకృష్ణ, కె.చిన్న, పి.చలం తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని కొత్తపల్లి గ్రామం శివారున ఆదివారం రాత్రి ఆగి ఉన్న లారీని గోకవరం ఆర్‌టిసి డిపోకు చెందిన బస్సు ఢీకొంది. కాకినాడ నుంచి గోకవరం వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బస్సు ముందుభాగం నుజ్జు అయ్యింది. రాత్రి సమయం కావడం, ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

ఆర్ట్స్ కళాశాల ప్రొఫెసర్ పద్మజకు డాక్టరేట్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రభుత్వ అటానమస్ కళాశాల, రసాయన శాస్త్ర అధ్యాపకురాలు మంచిరాజు పద్మజ డాక్టరేట్ పొందారని ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర తెలిపారు. ఔషధ గుణాలు సంవృద్ధిగా గల అకేసియా కేసియా మొక్క నుంచి హరిత నానో సంశ్లేషణ చేసిన లోహ ఆక్సైడ్ల యాంటీ ఆక్సిడెంట్, శిలీంధ్ర నిరోధకత మరియు యాంటీ క్యాన్సర్ జీవసంబంధ ధర్మాలు అనే అంశంపై ప్రొఫెసర్ పి.శ్యామల పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేశారన్నారు. ఈ మేరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పద్మజ డాక్టరేట్ పొందారన్నారు. ఈ సందర్భంగా కళాశాల బోర్డ్ ఆఫ్ రీసెర్చ్ స్టడీస్ సమన్వయ కర్త డాక్టర్ గౌరీనాయుడు, రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఆమెను అభినందించారు.

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో చేనేత ప్రదర్శన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరేట్‌లో ఒకపై ప్రతి సోమవారమూ చేనేత వస్త్రాల ప్రదర్శన ఉంటుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆప్కో స్టాల్‌ను కలెక్టర్ సందర్శించి మాట్లాడారు. చేనేత పరిశ్రమను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ప్రజలకు 30 శాతం రిబేట్‌పై ఆప్కో చేనేత వస్త్రాలను అందుబాటులో ఉంచామన్నారు. చేనేత వస్త్రాలను వినియోగించడం ద్వారా నేతన్నలకు మెరుగైన జీవనోపాధి కల్పించొచ్చన్నారు. వారంలో ఒక్కరోజు ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని సూచించారు. ప్రతి శనివారం ప్రభుత్వ ఉద్యోగులు ఆప్కో చేనేత వస్త్రాలు ధరించేలా చర్యలు తీసుకోవాలని, అలాగే జిల్లా ప్రజలు చేనేతను ప్రోత్సహిస్తూ ఆప్కో వస్త్రాల కొనుగోలును ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఉన్నత విద్య

ప్రజాశక్తి-తాళ్లపూడి

పేద విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్య అందించడమే కాకుండా ఏ ఒక్క విద్యార్థి చదువు ఆర్థిక కారణంగా ఆగకూడదన్న ఆలోచనతో నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రవేశపెట్టి అమలు చేయడం వల్ల ఎంతో మంది పేద విద్యార్థలకు మేలు కలిగిందని వైసిపి కొవ్వూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు అన్నారు. వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని కొవ్వూరు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా గజ్జరం ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నోటు పుస్తకాలను సోమవారం తలారి అందజేశారు. ఈ కార్యక్రమంలో గజ్జరం సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు కొలిశెట్టి నాగేశ్వరరావు, నాయకులు వై.శ్రీను, జి.రత్నాజీ, వై.రాజు, పి.శ్రీను, న్యాయవాది నందా పాల్గొన్నారు.

సిబ్బంది లేక పాడి రైతుల ఇబ్బందులు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండల పశువుల ఆసుపత్రిలో సిబ్బంది లేక నానా ఇబ్బందులు పడుతున్నామని పాడి రైతులు తెలిపారు. ఈ ఆసుపత్రికి ప్రతి రోజూ 20 నుంచి 30 వరకూ పశువులను చికిత్స కోసం తీసుకొస్తారన్నారు. ప్రస్తుతం వెటర్నరీ డాక్టర్ ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఒకేసారి ఎక్కువ పశువులకు వైద్యం అందించాలంటే ఆలస్యమవుతుందని తెలిపారు. వైద్యాధికారి ఒక్కోసారి ఏదైనా సమావేశాలకు, అత్యవసర కేసుల నిమిత్తం ప్రక్క గ్రామాలకు వెళ్లవలసి వస్తే ఆ రోజు ఆసుపత్రికి వచ్చిన రైతులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఈ మండల ఆసుపత్రికి వెటర్నరీ అసిస్టెంట్, అటెండరు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వెంటనే ఖాళీలను భర్తీ చేసి సమస్యను పరిష్కరించాలని రైతులు మేకా సూర్యారావు, గూడపాటి రామారావు, జుట్టా తాతాజీ, తంగెళ్ల రవికుమార్ తదితరులు కోరుతున్నారు.

అర్హులందరికీ 'తల్లికి వందనం" అమలు చేయాలి

ప్రజాశక్తి-కడియం

రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి విద్యార్థి తల్లుల ఖాతాకు తల్లికి వందనం డబ్బులు జమ చేయాలని కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం రూరల్ కో-ఆర్డినేటర్ తాడాల కొండ్రాజు డిమాండ్ చేశారు. సోమవారం బుర్రిలంకలోని ఆయన కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది తల్లులు తల్లికి వందనం డబ్బులు పడకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. అన్ని అర్హతలు చూపించి సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నప్పటికి తాజా అర్హుల జాబితాలో పేర్లు లేకపోవడతో బ్యాంకులు, సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. అధికారులు తక్షణం సాంకేతికపరమైన లోపాలను సరిచేసి ప్రతి మండలంలో మండల ఎడ్యుకేషన్ అధికారితో ప్రత్యేక గ్రీవెన్స్ ద్వారా అర్హుల లిస్టు తయారు చేసి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యాళ్ల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పైడిమెట్ట పాఠశాలలో గరిమెళ్ల జయంతి

ప్రజాశక్తి- తాళ్లపూడి

స్వాతంత్రోద్యమ సమయంలో తన గీతాలతో ప్రజలను ఉత్తేజపరిచిన కవి గరిమెళ్ల సత్యనారాయణ అని పైడిమెట్ట మండల పరిషత్ బేసిక్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు అన్నారు. గరిమెళ్ల జయంతి సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలో సమరయోధుని చిత్రపటానికి ఉపాధ్యాయులు విద్యార్థులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ గరిమెళ్ల రచించిన రచనలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో దుర్గారావుతో పాటు సహోపాధ్యాయుడు ధర్మాన రాము విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత నగరంగా రాజమహేంద్రవరం

పలు దుకాణాల్లో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం నగరాన్ని ప్లాస్టిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని కలెక్టర్, ఇన్‌ఛార్జి కమిషనర్ పి.ప్రశాంతి తెలిపారు. జామ్ పేటలోని పూల మార్కెట్, ఫిష్ మార్కెట్, సివి మార్కెట్‌లలో సోమవారం ఆమె ఆకస్మిక దాడులు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. నగరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తామన్నారు. ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్ వస్తువుల వల్ల మానవాళి మనుగడకే ముప్పు వాటిల్లుతోందన్నారు. పర్యావరణానికి హానికరమైన దాదాపు 20 రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను ప్రభుత్వం నిషేధించిందన్నారు. 120 మైక్రాన్లకంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ కవర్లను పూర్తిస్థాయిలో నిలిపివేయాలన్నారు. జ్యూట్ బ్యాగులు, కాగితపు సంచులను మాత్రమే వినియోగించాలని ప్రజలకు సూచించారు. అలాగే ప్లాస్టిక్ రహిత జీవన విధానాన్ని ప్రతిఒక్కరూ అలవాటు చేసుకుని.. ప్లాస్టిక్ ముప్పు నుండి నగరానికి విముక్తి కల్పిద్దామన్నారు. కలెక్టర్ వెంట ఎంహెచ్ఒ ఎ.వినూత్న, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు

'కూటమి పాలనపై మహిళల సంతృప్తి'

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

కూటమి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అనవసరంగా విమర్శిస్తున్నా, రాష్ట్రంలోని మహిళలంతా తమ పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. మండలంలోని మోర్త గ్రామంలో సోమవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటా పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాలనపై ఆరా తీశారు. కరపత్రాలను ఇచ్చి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, పార్లమెంట్ బిసి సెల్ ఉపాధ్యక్షులు రాచమళ్ల శ్రీనివాస్, టిడిపి మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, నాయకులు వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'దేవోక్తి' సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి-గోపాలపురం

దేవోక్తి చిడిపి సోషల్ సర్వీస్ సంస్థ సేవలు వెలకట్టలేనివని ఎఎస్ఒ జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని వేళ్ల చింతలగూడెంలో కుక్కల గంగాజలం మూడేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని జోడాల దేవోక్తి సభ్యులకు వివరించారు. వారి సహకారంతో వీల్‌చైర్‌ను అందించారు. వికలాంగులు తమ సంస్థను లేదా 9391089381 నెంబర్‌ను సంప్రదిస్తే ఉచితంగా కృత్రిమ అవయవాలు, ఉపకరణాలు అందిస్తామని సంస్థ ప్రతినిధి ప్రత్తిపాటి నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి నాగరాజు, సభ్యులు కుక్కల కీర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డాకు మాజీ ఎంఎల్ఎ శ్రీనివాస్ నాయుడు పరామర్శ

ఉండ్రాజవరం : మండలంలో పలువురిని మాజీ ఎంఎల్ఎ శ్రీనివాస్‌నాయుడు సోమవారం పరామర్శించారు. ఇటీవల మాతృవియోగంతో బాధపడుతున్న పాలంగి గ్రామ వైసిపి నాయకులు దొడ్డా సూర్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మాతృమూర్తి లక్ష్మి సంస్మరణ కార్యంలో పాల్గన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆయన వెంట జడ్‌పిటిసి సభ్యులు నందిగం భాస్కర రామయ్య, ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, నాయకులు నాగిరెడ్డి వెంకటేశ్వర్లు, సిద్ధార్థ రాజు తదితరులున్నారు.

ట్రిపుల్ ఐటికి సరస్వతి విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - కోరుకొండ

నూజివీడు ట్రిపుల్ ఐటికి కోరుకొండ సరస్వతి విద్యార్థిని ఎంపికైందని కరస్పాండెంట్ పెనకటి గంగాధర్ తెలిపారు. సరస్వతి విద్యార్థిని ముల్లంగి గౌరీదేవి ఈ ఘనత సాధించిందన్నారు. ప్రిన్సిపల్ మట్టాడి హనుమ మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు షైనింగ్ స్టార్స్, నవోదయతో పాటు ట్రిపుల్ ఐటికి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గౌరీదేవిని కరస్పాండెంట్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభావతి, డి.వసంతరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

ప్రజాశక్తి - గోపాలపురం

రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని తహసిల్దార్ కె.అజయ్ బాబు కోరారు. ఈనెల 30న మెగా రక్తదాన శిబిరం శార్వాణి రెసిడెన్షియల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని తహశీల్దార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాలలో రక్తం అందుబాటులో లేక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. దాతలు రక్తదానం చేయడంతో వారి ప్రాణాలు కాపాడొచ్చున్నారు. ఈ కార్యక్రమంలో బృందా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శ్యామ్, నాగరాజు, గణేష్, ప్రవీణ్, దేవోక్తి సోషల్ సర్వీసు ప్రతినిధి నాగరాజు పాల్గొన్నారు.

పని వేళల్లో కాన్ఫరెన్స్‌లు తగదు

ప్రజాశక్తి - నిడదవోలు

ప్రభుత్వ కార్యాలయాల పని వేళల్లో వీడియో కాన్ఫరెన్సులు తగదని, పనివేళల్లో సమావేశాల వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువ్వల రాంబాబు అన్నారు. ఈ సమయాలను మార్చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వివిధ పనుల కోసం పనులు మానుకుని ప్రజలు వస్తుంటారన్నారు. ఆ సమయంలో అధికారులు సభలు, సమావేశాల్లో ఉండటంతో పనులు నిలిచిపోతున్నాయన్నారు. కూలీల పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందన్నారు. తక్షణమే సమయాల్ని మార్చుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వెంకటలక్ష్మి కుటుంబానికి ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో చంద్రవరం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు బండి సత్యనారాయణ భార్య ఎంపిటిసి మాజీ సభ్యురాలు బండి వెంకటలక్ష్మి కుటుంబాన్ని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం పరామర్శించారు. పార్టీకి ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఆయన వెంట కూటమి నాయకులు ఉన్నారు.

చంద్రవరంలో 'సుపరి పాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి - చాగల్లు

చంద్రవరం గ్రామంలో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎంఎల్ఎ ముప్పిడి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది పాలనలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలను ప్రజలకు తెలిపారు. త్వరలో కూటమి ప్రభుత్వం చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఇంటింటా తిరిగి కరపత్రాలు పంచారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కొవ్వూరు

పిజిఆర్ఎస్‌లో వచ్చే అర్జీదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్‌డిఒ రాణి సుస్మిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఆమె పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 17 అర్జీలు వచ్చాయన్నారు. వారంలోగా వీటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

16న విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో పలు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపిస్తామని విద్యుత్ శాఖ ఇఇ జెపిబి.నటరాజన్ తెలిపారు. పురుషోత్తపట్నం 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11కెవి సీతానగరం రూరల్ ఫీడర్‌లో ట్రీ కటింగ్, లైన్ నిర్వహణ పనుల కారణంగా బుధవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం1 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వంగలపూడి, సింగవరం, చీపురుపల్లి, అచియపాలెం, పెదకొండేపూడి. పురుషోత్తపట్నం ఉపకేంద్రం పరిధిలోని పురుషోత్తపట్నం, రామచంద్రపురం, చిన్నకొండేపూడి గ్రామాల పరిధిలోని వ్యవసాయ బోర్లకు అంతరాయం కలుగుతున్నారు. దీనికి సహకరించాలని వినియోగదారులను కోరారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
I.A. No. 770/2024
O.S. No. 19/2020

Between:
Adapa Adinarayana Murthy, S/o. Brahmadevudu, Hindu, aged 35 years, resident of Vanapalli, Kothapeta Mandal, Kothapeta JCJC.
...Petitioner/ Plaintiff
AND
Maddi Kejiya, W/o. Vara Prasad, Hindu aged 41 years, Property, R/o. D.No. 29-21-1/1, Lakshmivarapu peta, Rajamahendravaram, Rajamahendravaram JCJC.
...Respondent/ Defendant

పై నెంబరు పిటిషనులో రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 21-7-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషనులో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషనును మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి **కవి హనుమంతరావు**
14-7-2025 అడ్వకేట్, రాజమండ్రి

NOTICE

Under the instructions of my client i.e., The Branch Manager, Tata Capital Housing Finance limited, Door No. 86-1-9, Second Floor, B-Square, opposite to Ravindra Bharathi School, J. N. Road, Rajamahendravaram, I hereby issue the following notice to the public in General.

1. Sri. Nagaraboyina Chanti, S/o. Simhachalam, approached by client for loan on his Property covered by Settlement Deed dated 22-01-2025 Registered as document No.430/2025, in the office of SRO., Kadiyam.
2. My client verified the documents and willing to sanction loan Sri. Nagaraboyina Chanti, on his property covered by the above Settlement Deed.
3. If anybody got any attachments, injunctions, or objections for sanction of loan on the property covered by the above Settlement Deed to Sri. Nagaraboyina Chanti, they may inform them to my client or to me within seven days from the date of issue of this notice, failing which my client will treat the property as free hold and of proceed further for sanction of loan to Nagaraboyina Chanti.

4. Schedule of Property:
East Godavari District, Kadiyam Sub-Registry, Rajamahendravaram Rural Mandalam, Morampudi Revenue Measurement area Satellite City Gram Panchayath area, Survey No.11/2 in it site consisting of 72.53 Sq.yards, along with ground and first floor (G+1) Building bearing door No.106-3-1079, bounded by :
EAST: House of Bhukailash - 19.4 ft. **WEST:** Road - 19.4 ft. **NORTH:** House belongs to B. Raju - 34.0 ft, **SOUTH:** House of T. Manga - 34.0 ft.
Within the above boundaries site consisting of 72.53 Sq.yards or 60.64 Sq. meters, along with Ground and First Floor (G+1) Building bearing door No.106-3-1079, with Electrical Service connection No. 143380630 9016930, etc., along with all usual easement rights.

D.V.KRISHNA RAO
Advocate, Flat No.102, D.No. 25-1-45,
Rajahmundry Kambala cheruvu
Dt.14-7-2025 Rajahmundry
Cell: 9490178358

మహారాజశ్రీ A.J.F.C.M కోర్టువారి దివ్య సముఖమునకు అమలాపురం
O.S.No.334/2022

Between:
నడింపల్లి హరికృష్ణంరాజు ...వాది
మరియు
నడింపల్లి వెంకటపతిరాజు ...ప్రతివాది

పేపరు ప్రకటన

ప్రతివాది. Nadimpalli Venkatapathi Raju, S/o.Narayana Raju, Hindu, age 82 years, Komaragiripatnam, Allavaram Mandal, Dr.B.R.Ambedkar Konaseema Dist.

పై నెంబరు దావాలో O.S.No.334/2022 లో ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీకు అమలు జరిగియుండలేదు. శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ప్రతివాది అయిన మీకు పేపరు ప్రకటన మేయమని ఆర్డరు పాస్ చేసినారు. వాయిదా **17-07-2025వ** తేదీన వాయిదా అయి వున్నది. ప్రతివాది అయిన మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారు ద్వారా గాని వాయిదా రోజున శ్రీ కోర్టు నందు హాజరు కావలెను. లేనిచో పరోక్షముగా తీర్మానితులు అవుదురు.

వాయిదా: ది.17-07-2025న ఉదయం గం॥ 10.30 ని॥లకు

శ్రీ కె.మల్లపరాజు
అమలాపురం శ్రీ కె.ఎస్.శ్రీరామ్
ది.13-7-2025 అడ్వకేట్స్, అమలాపురం

BEFORE THE HONOURBLE A.P. CO-OPERATIVE TRIBUNAL VIJAYAWADA
MP No. 171 of 2024
IN
O.P. No. 4 of 2019

Between:
The Jayalakshmi Mutually Aided Multi purpose Co-Operative Mutually Society Limited (Regd. No. AMC/E.G.Dt.) DCO/99/4, rep.by Vice-Chairman Polaki Venkata Ramana Murthy, Son of lat Manmadha Rao, Aged about 64 years, Vice- Chairman, D.No.9-54/3, Sri Lakshmi Complex, Sarpavaram Junction, Kakinada-5
.... Petitioner
And
1) Kala Usha Devi,
2) Chavali Sai Sridevi ....Respondents
To
Kala Usha Devi, (1st Respondent) Wife of late Kala Bharatha Sastry, Aged about 67 years, House Wife, Resident of D. No. 4-56, Nagarjuna Colony, Valasapakala, Kakinada, East Godavari District-533005.

Please take notice that the above petition (final Decree petition) for recovery of the amount and Honorable Tribunal ordered Notice to you and posted the case to 05-08-2025 for your appearance. So you are hereby to appear before the above Hon'ble Tribunal On 05-08-2025 at 10.30 a.m. in person or through your Advocate in the above petition, failing which the matter will be decided in your absence.

(By order of the Hon'ble Tribunal)
Date of Adjournment: 05-08-2025
T. Anjaneyulu,
Advocate, Vijayawada.

మహారాజశ్రీ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, విజయవాడ వారి ముందు
F.A. No. 637/2024
Dudala venkata Rao & Another
.... Appellants
And
Geddam Prasada Rao & others
.... Respondents
1) Alturima Infra Private Ltd., Rep by its Chairman & M.D. Sri Maddireddy Yesubabu Naidu, D.No.4-1209/75, Marthanda Nagar, New Hafizpet, Mlyapur, Hyderabad.
2) Alturima Infra Private Ltd., Rep by its Chairman & M.D. Sri Maddireddy Yesubabu Naidu, D.No. 73-12-4, 1st Floor, Prem Towers, Near Municipal School, Narayanapuram, Rajahmundry.
3) Maddireddy Yesubabu Naidu, S/o Maddireddy Veeraju, D.No. 73-12-4, 1st Floor, Prem Towers, Near Municipal School, Narayana puram, Rajahmundry.
4) Suramudi Satyanarayana S/o venkayya, D.No. 1-6, Main Road, Navav peta-533232, East Godavari Dist. A.P.
5) Surampudi Swamy Narayana, S/o Late S. Satyanarayana, D.No.1-6, Main Road, Navavpeta - 533232, East Godvari Dist, A.P.
6) Madireddy Adi Lakshmi, W/o Yesubabu Naidu, D.No. 73-12-03/4/101, Harinya Plaza, Burugu Chettu Street, Narayana puram, Rajahmundry Urban, East Godavari District, A.P. - 533103.

పై నెంబరు అప్పీల్ ప్రతివాదులైన నెంబర్ R2, R3, R4, R5, R8 & R9 పై రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, విజయవాడ వారి ఎదుట హాజరు నిమిత్తం ది. 7-8-2025నకు వాయిదా అయివున్నది. కావున పై ప్రతివాదులైన నెంబర్ R2, R3, R4, R5, R8 & R9 ది. 07-08-2025న ఉదయం 10-15 గం.లకు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై ఆక్షేపణలున్న తెలుపు కొనవలయును. లేనియెడల దావాలు పై పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయట మైనది.

(శ్రీ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, విజయవాడ ఉత్తర్వులననుసరించి)
డి.సత్యశివదర్శన్, అడ్వకేట్,
ఆర్‌కె.ఎన్‌క్లేవ్, శ్యామ్‌నగర్, లబ్బీపేట,
విజయవాడ. ఫోన్ : 9432020748